క్లుప్తంగా

ఆధారాలతోనే చంద్రబాబు అరెస్ట్



ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబును సీఐడీ అన్ని ఆధారాలతోనే అరెస్టు చేసిందని, చట్టం ముందు ఎవరైనా ఒకటేనని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. స్థానిక ఆయన కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు ఇప్పటికే 18 కేసుల్లో స్టేలు తెచ్చుకుని కాలం గడుపుతున్నాడని, స్టేలు ఉండబట్టే బయట తిరుగుతున్నాడని పేర్కొన్నారు. 2014లో ఓటుకు నోటు కేసులోనే అరెస్టు కావాల్సి ఉందని, దీని నుంచి తప్పించుకునేందుకు అప్పట్లో హైదరాబాద్ నుంచి పారిపోయి వచ్చాడన్నారు. వందల కోట్ల ప్రజాధనాన్ని దిగమింగిన చంద్రబాబును సీఐడీ అరెస్టు చేయడం సమంజసమేనన్నారు. లంచం తీసుకునే చిన్న ఉద్యోగులకు రెండు, మూడు నెలలు బెయిల్ రావడం లేదని, స్కిల్ స్కాంలో వందల కోట్లు అవినీతికి పాల్పడిన చంద్రబాబు పట్ల చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. సీమెన్స్ కంపెనీతో చేసుకున్న ఒప్పందం బూటకమన్న విషయం సీఐడీ దర్యాప్తులో తేలిందన్నారు. ఈ స్కామ్‌పై గతంలో అసెంబ్లీలో చర్చించారని అన్నారు. చంద్రబాబుపై కక్షసాధింపు చర్య కాదని, ప్రభుత్వానికి ఆ అవసరమే లేదన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల సత్వర పరిష్కారం

తిరువూరు: రాజీ చేసుకోదగిన కేసులను లోక్ అదాలత్‌లో సామరస్యంగా పరిష్కరించుకోవాలని తిరువూరు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మోతీలాల్ నాయక్ అన్నారు. తిరువూరు కోర్టు ఆవరణలో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. క్షణికావేశంలో నేరాలకు పాల్పడి కోర్టులు, పోలీసు స్టేషన్ల చుట్టూ తిరిగి విలువైన సమయం వృథా చేసుకోవద్దని, రాజీ మార్గమే రాజమార్గమని సూచించారు. తిరువూరు కోర్టు పరిధిలో 16 సివిల్ కేసులు, 320 క్రిమినల్ కేసులు, ఒక గృహ హింస కేసు, 12 ప్రీలిటిగేషన్ కేసులు కలిపి మొత్తం 349 కేసులను పరిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జనార్దనరావు, అంజన్‌రెడ్డి, ఏపీపీ ఓడేమియా, లోక్ అదాలత్ సభ్యుడు ఎం.సత్యం, న్యాయవాదులు మోహన్‌రెడ్డి, మాధవరావు, రాంమోహన్‌రాజు, శ్రీనివాసరావు, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

మహ్మద్ అల్తాఫ్ రజాకు డిప్యూటీ సీఎం పరామర్శ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): షాబూఖారి మసీదు మత గురువు మహ్మద్ అల్తాఫ్ రజాను రాష్ట్ర ముస్లిం మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా శనివారం పరామర్శించారు. ఇటీవల అల్తాఫ్ రజా తండ్రి షేక్ అబ్దుల్ ఖాదర్ జిలానీ, తల్లి ముంతాజ్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మంత్రి అంజాద్ బాషా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ప్రజాధనాన్ని దారిమళ్లించినందుకే చంద్రబాబు అరెస్ట్

అధికారాన్ని అడ్డు పెట్టుకుని ప్రజాధనాన్ని దారిమళ్లించినందుకే టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును అరెస్ట్ చేశారని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇంతకాలం తాను నిప్పునని, నిజాయితీపరుడినని బుకాయించిన చంద్రబాబు బండారం ఇప్పుడు స్కిల్‌డెవలప్‌మెంట్ స్కాంతో బయటపడిందని పేర్కొన్నారు. –తిరువూరు

యువతను మోసం చేశాడు



వేల కోట్ల రూపాయల ప్రభుత్వ ధనంతో యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చే పేరుతో తన ఉత్తుత్తి కంపెనీలకు మళ్లించిన టీడీపీ అధినేత చంద్రబాబు నిరుద్యోగుల మోసం చేశాడు. ఎన్ని కుంభకోణాలు చేసినా తాను చట్టానికి దొరకనని ధీమాతో ఉన్న చంద్రబాబుకు శిక్ష పడటం ఖాయం.

– భూక్యా గన్యా, జెడ్పీటీసీ సభ్యుడు, ఏకొండూరు

పార్టీలోనే సానుభూతి కరువు



తనను అరెస్టు చేస్తే పార్టీ శ్రేణులు కన్నెర్ర చేస్తాయని ఆశించిన చంద్రబాబునాయుడుకు ఆశాభంగం కలిగింది. స్కిల్ డెవలప్‌మెంట్ నిధుల దుర్వినియోగం కేసులో ఆయన అరెస్టైతే పార్టీ నాయకుల్లో సానుభూతి కరువైంది. చట్టాలను దుర్వినియోగం చేయడంలో ఆరితేరిన బాబు ఎట్టకేలకు ఆ చట్టానికే చిక్కారు.

– కాలసాని నాగలక్ష్మి, ఎంపీపీ, ఏకొండూరు

చేసిన తప్పులకు శిక్ష తప్పదు



తెలుగుదేశం ప్రభుత్వంలో చేసిన అక్రమాలన్నింటికీ చంద్రబాబునాయుడే బాధ్యుడు. ఆయన అక్రమాలకు శిక్ష తప్పదు. స్కిల్ డెవలప్‌మెంట్ నిధులను అడ్డగోలుగా తినేసి బుకాయిస్తున్న చంద్రబాబునాయుడ్ని అరెస్టు చేయడం సమర్థనీయం.

–యరమల రామచంద్రారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు, తిరువూరు

ఎంతటివారైనా చట్టం ముందు సమానులే



అధికార దుర్వినియోగానికి పాల్పడిన వారు ఎంతటివారైనా చట్టం ముందు సమానులే. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన కుంభకోణాలు, అక్రమాలు ఇప్పుడిప్పుడే వెలుగుచూస్తున్నాయి. చేసిన తప్పులకు శిక్ష తప్పదు. ఆయనపై వచ్చిన ఆరోపణలకు సమాధానం చెప్పాలి.

– సిరసాని ప్రకాష్, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు, విస్సన్నపేట

చట్టపరంగా చర్యలు తప్పవు



తాను నిజాయితీ పరుడినంటూ వేదాలు వల్లించే మాజీ సీఎం చంద్రబాబును స్కిల్ డెవలప్‌మెంట్ నిధుల కుంభకోణంలో పోలీసులు అరెస్టు చేసినా టీడీపీ నాయకులు, కార్యకర్తల నుంచి స్పందన లేకపోవడం గమనార్హం. ఆయన తన పార్టీలోనే సానుభూతి కోల్పోయారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమాలకు పాల్పడిన చంద్రబాబుపై చట్టపరంగా చర్యలు తప్పవు.

– మెర్సీ వనజాక్షి, విస్సన్నపేట ఎంపీపీ

సమాధానం చెప్పాలి



మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై వచ్చిన అవినీతి ఆరోపణలకు ఆయనే బాధ్యత వహించాలి. వేల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి నిజాయతీ కబుర్లు చెప్పడం 'బాబు'కే చెల్లింది. ఐదేళ్ల టీడీపీ పాలనలో ఇంకెన్ని అక్రమాలు పాల్పడ్డాయో అధికారులు బయటికి తీయాలి.

– శ్రీలక్ష్మి, గంపలగూడెం ఎంపీపీ

అరెస్ట్ సక్రమమే



స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబు అవినీతికి పాల్పడినట్లు తేటతెల్లమైంది. సీఐడీ అధికారులు రెండేళ్లుగా పరిశోధనలు చేసి పక్కా ఆధారాలు సంపాదించి అరెస్ట్ చేయడం చట్టబద్ధమే.

– కె.గురవయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కొండపల్లి

చట్టం తన పని తాను చేసుకుపోతుంది



చట్టం తన పని తాను చేసుకుపోతుంది. చేసిన తప్పుకు ఎంతటివారైన శిక్ష అనుభవించకతప్పదు. చంద్రబాబు చేసిన తప్పుకు ప్రతిఫలంగా ఇప్పుడు శిక్ష అనుభవించాల్సిందే.

– జక్రధరరావు, జెడ్పీటీసీ సభ్యుడు, జి.కొండూరు

ప్రజాధనాన్ని దోచుకున్నాడు



చంద్రబాబు నాయుడు చేసిన పాపాలకు శిక్ష తప్పదు. వందల కోట్ల కుంభకోణానికి పాల్పడినందుకు చంద్రబాబును అరెస్ట్ చేశారు. ప్రజా ధనాన్ని అక్రమంగా దోచాడు.

– ఎం.నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఇబ్రహీంపట్నం

అవినీతికి కేరాఫ్ చంద్రబాబు



తాను నిజాయితీపరుడినని ఆర్భాటంగా చెప్పుకుంటున్న చంద్రబాబు అక్రమాలు ఇప్పుడు బయటపడుతున్నాయి. ఆయనను సిట్ అధికారులు అరెస్టు చేయడంతో ప్రజలకు వాస్తవాలు తెలుస్తున్నాయి. అవినీతికి, అక్రమాలకు పాల్పడిన చంద్రబాబు చట్టానికి దొరికిపోయారు.

– గద్దల భారతి, ఎంపీపీ, తిరువూరు

టీడీపీ కేడరే పట్టించుకోవట్లేదు



మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడ్ని అరెస్టు చేస్తే కనీసం ఆ పార్టీ కేడర్ పట్టించుకోలేదంటే ఆయన పరిస్థితి అర్థమవుతుంది. అధికారంలో ఉన్నప్పుడు ఇష్టానుసారం కోట్లాది రూపాయల నిధులు దుర్వినియోగం చేసిన 'బాబును కఠినంగా శిక్షించాలి.

– గత్తం కస్తూరిబాయి, నగరపంచాయతీ చైర్‌పర్సన్, తిరువూరు

సంక్షిప్త వార్తలు

■ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నూజివీడు: ప్రభుత్వం అందిస్తున్న సేవలను గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని నూజివీడు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దయాల ఆశ పేర్కొన్నారు. మండలంలోని పడమర దిగవల్లి పీహెచ్‌సీలో శనివారం నిర్వహించిన ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్(పీఎంఎస్ఏ) కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గర్భిణులకు అవసరమైన వైద్య పరీక్షలు చేయడం, స్కానింగ్ తీసి మందులు అందజేస్తారని తెలిపారు. దీనిలో భాగంగా గర్భిణిగా ఉన్నప్పుడు, ప్రసవానంతరం బాలింతల సంరక్షణే ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యమన్నారు. ప్రతినెలా 9న పీహెచ్‌సీల వద్ద, ఆస్పత్రిల వద్ద గర్భిణులకు న్యాణ్యమైన సేవలను అందిస్తారన్నారు. వైద్యాధికారి సునందాకుమారి పాల్గొన్నారు.

■ ఉపాధ్యాయుల పాత్ర కీలకం

నూజివీడు: దేశాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, నేటి బాలలను రేపటి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అన్నారు. పట్టణంలోని రోటరీ ఆడిటోరియంలో నూజివీడు డివిజన్ ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు బోధనలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పిల్లలకు విద్యాబోధన చేయాలన్నారు. విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ విజయ్‌భాస్కర్, డీవైఈఓ ఎం.సేవియా పాల్గొన్నారు.

■ ఎస్సీ వర్గీకరణ చేయాలి

నూజివీడు: కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణ చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ కన్వీనర్ కంకట వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించే పార్లమెంటు సమావేశాల్లో వర్గీకరణ బిల్లు పెట్టి చట్టం చేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపుమేరకు పట్టణంలోని శ్రీనివాస సెంటర్ వద్ద శనివారం ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కో కన్వీనర్లు వెంపటి వెంకటేశ్వర మాదిగ, ముళ్లపూడి వెంకటేశ్వర మాదిగ, ఏలూరు జిల్లా ఎమ్మెస్పీ కో కన్వీనర్ తొమ్మండ్రు రుద్రయ్య మాదిగ పాల్గొన్నారు.

■ 8 గ్రామాల్లో రీసర్వే

తిరువూరురూరల్: మండలంలోని ఎనిమిది గ్రామాల్లో జగనన్న శాశ్వత భూహక్కు రీసర్వే జరుగుతోందని తహసీల్దారు సురేష్‌బాబు తెలిపారు. రీసర్వే ప్రక్రియను శనివారం పరిశీలించిన ఆయన రైతులకు పలు సూచనలిచ్చారు. గతంలో ఉన్న వివాదాలను పరిష్కరించడంతో పాటు పక్కాగా రెవెన్యూ రికార్డును రూపొందించడంలో భాగంగానే రీసర్వే జరుగుతోందన్నారు. మల్లేల, లక్ష్మీపురం, అక్కపాలెం, ఎర్రమాడు, పెద్దవరం, వావిలాల, కోకిలంపాడు, రామన్నపాలెం గ్రామాల్లో రైతులు రీసర్వేకు సహకరించాలని కోరారు.

■ స్పందన లేని నిరసనలు

చాత్రాయి: మాజీ సీఎం చంద్రబాబునాయుడు అరెస్టుపై శనివారం మండలంలో టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసనలకు స్పందన కానరాలేదు. పోలవరం, చనుబండ సూరంపాలెంలో 10 మంది కార్యకర్తలతో రోడ్డు పక్కన నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఎస్సై స్వామి ఆధ్వర్యంలో ముఖ్యమైన గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

■ కొత్త పెన్షన్ల పంపిణీ

తిరువూరు: అర్హత కలిగివుండీ పెన్షన్లు మంజూరు కాని పేదలను గడప గడపకు మన ప్రభుత్వంలో గుర్తించిన తదుపరి వారికి ఈ నెల నుంచి వైఎస్సార్ పెన్షను కానుక కింద కొత్త పెన్షన్లు పంపిణీ చేశారు. శనివారం స్థానిక 19వ వార్డులో కొత్త పెన్షనుదారులకు వార్డు కౌన్సిలర్ సత్యనారాయణ, వార్డు సచివాలయ కన్వీనర్లు సత్యనారాయణ, ప్రసాద్, శిరీష అందజేశారు.

■ టీడీపీ నిరసనలు పాక్షికం

ముసునూరు: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా శనివారం పాక్షికంగా ధర్నాలు నిర్వహించారు. ముసునూరు, చింతలవల్లి, కాట్రేనిపాడు, చెక్కపల్లి, గుడిపాడుల్లో మండల ద్వితీయ శ్రేణి నాయకులు కొద్దిసేపు ధర్నాలు నిర్వహించారు.

■ ఎమ్మార్పీఎస్ రిలే దీక్షలు ప్రారంభం

తిరువూరు: ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యే ప్రత్యేక పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట శనివారం రిలే దీక్షలు ప్రారంభించారు. ఈ నెల 23వ తేదీ వరకు ఈ ఆందోళన కొనసాగుతుందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి నాగమల్లేశ్వరరావు తెలిపారు.

■ ఎర్రమాడులో మేరీ మాటీ–మేరా దేశ్

ఎర్రమాడు(తిరువూరురూరల్): ఆజాదీ కా అమృత మహోత్సవం ముగింపు కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఎర్రమాడులో శనివారం మేరీ మాటీ–మేరా దేశ్ నిర్వహించారు. దేశ రాజధాని ఢిల్లీలో పవిత్ర అమృతవాటిక నిర్మాణంలో వినియోగించేందుకు మట్టి సేకరించే కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు అచ్యుతరావు, వెంకటేశ్వరరెడ్డి, రామచంద్రరావు, ఇమానుయేలు నిర్వహించారు.

■ స్వీయ క్రమశిక్షణను పెంచుకోవాలి

నూజివీడు(ఆగిరిపల్లి): ప్రధానోపాధ్యాయులు స్వీయ క్రమశిక్షణ, అవగాహన, లక్ష్యాలను సాధించడంలో సామర్థ్యాన్ని పెంచుకోవడం, అభివృద్ధి మనస్తత్వాన్ని కలిగి ఉండటం వంటివి పెంపొందించుకోవాలని సమగ్రశిక్ష జాయింట్ డైరెక్టర్ విజయ్‌భాస్కర్ పేర్కొన్నారు. ఆగిరిపల్లి మండలం తోటపల్లిలోని హీల్ ప్యారడైజ్ స్కూల్లో ఆరు రోజులుగా నిర్వహిస్తున్న ఎనిమిదవ బ్యాచ్ పాఠశాల నాయకత్వ శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది.

కేసులు పరిష్కరించడమే లక్ష్యం

నూజివీడు: లోక్ అదాలత్‌లో ఇచ్చే తీర్పుకు అప్పీలు ఉండదని, కక్షిదారులు రాజీమార్గంలో తమ కేసులను పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్‌లు మంచి మార్గమని 15వ అదనపు జిల్లా జడ్జి ఏ నాగశైలజ అన్నారు. పట్టణంలోని కోర్టు భవనాల ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ కక్షిదారులు క్షణికావేశంలో చేసిన చిన్న తప్పుల కారణంగా ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బును వృథా చేసుకుంటున్నారన్నారు. కేసుల సత్వర పరిష్కారానికే లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నామన్నారు.

1,300 కేసుల పరిష్కారం

జాతీయ లోక్ అదాలత్‌లో 1,300 కేసులను పరిష్కరించారు. నష్టపరిహారం కింద రూ.1.35 కోట్లు చెల్లించారు. లోక్ అదాలత్‌లో సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెదఖాసిం, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్‌ఎల్ శ్రీనివాసరావు, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కే హరిబాబు, స్పెషల్ మెజిస్ట్రేట్ వి. కృష్ణమూర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సత్యప్రకాష్, న్యాయవాదులువిక్రమ్‌కుమార్, నీలాంబరం పాల్గొన్నారు.